ప్రజాశక్తి

మంగళవారం 30 సెప్టెంబరు, 2025

డిఎస్‌సి విజేతలకు సన్మానం

డిఎస్‌సి విజేతలను సన్మానిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

బిసి స్టడీ సర్కిల్‌లో శిక్షణ తీసుకొని డిఎస్‌సికి ఎంపికైన 12 మందిని అధికారులు అభినందించారు. నగరంలోని జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఆధ్వర్యాన అధికారులు సోమవారం వారిని సత్కరించారు. బిసి సంక్షేమ శాఖ అధికారి అనురాధ మాట్లాడుతూ బిసి స్టడీ సర్కిల్ ద్వారా పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఈ శిక్షణ సద్వినియోగం చేసుకునే యువత ఉద్యోగాలు సాధిస్తున్నారని తెలిపారు.

గంజాయి స్మగ్లింగ్‌పై ఉక్కుపాదం

- రెండు నెలల్లో 350 కేజీలకు పైగా స్వాధీనం
- 740 ఈవ్‌టీజర్లపై చర్యలు
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లాలో మత్తు పదార్థాల వినియోగం, అక్రమ రవాణా, విక్రయాలను పూర్తిగా అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి అధికారులను ఆదేశించారు. విద్యార్థులు, వర్కర్లు, డ్రైవర్లను లక్ష్యంగా చేసుకుని గంజాయి సరఫరా జరుగుతున్న నేపథ్యంలో గట్టి నిఘా అవసరమన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన నార్కోటిక్ సమన్వయ కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. అన్ని కళాశాలల్లో తక్షణమే ఈగల్ కమిటీలు ఏర్పాటు చేసి డ్రగ్స్‌పై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. డ్రగ్స్ విక్రయాలు జరుగుతున్న ప్రాంతాల్లో కఠిన తనిఖీలు చేయడంతో పాటు బాధితులకు కౌన్సిలింగ్, పునరావాసం కల్పించాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలల్లో రెగ్యులర్‌గా అవగాహన సదస్సులు నిర్వహించాలని, డ్రగ్స్ రహిత సమాజంపై సోషల్ మీడియాలో విస్తత ప్రచారం చేయాలని సూచించారు. డ్రగ్స్ సమాచారం కోసం 112, 1930 నంబర్లకు ఫోన్ చేయాలని విజ్ఞప్తి చేశారు. జూలై, ఆగస్టులో 350.4 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని 77 మందిని అరెస్ట్ చేసి, 8 వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్‌పి తెలిపారు. మహిళల భద్రతకు అమలు చేస్తున్న 'నారీ శక్తి' కార్యక్రమం ఫలితాలు ఇస్తోందన్నారు. 740 మంది ఈవ్ టీజర్లను గుర్తించి చర్యలు తీసుకున్నామని తెలిపారు. 'శక్తి యాప్' ద్వారా అత్యవసర సహాయం కోరితే 5 నిమిషాల్లోనే శక్తి టీమ్‌లు సంఘటనా స్థలానికి చేరుకుంటాయని చెప్పారు. మహిళలు తప్పనిసరిగా ఈ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలల వద్ద స్పీడ్ బ్రేకర్లు, పెట్రోల్ బంకుల్లో సిసి కెమెరాలు, మలుపుల వద్ద బారికేడ్లు, ప్రమాద సూచికలు తప్పక ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రమాద ముప్పు ప్రాంతాలను గుర్తించి, వాహన చోదకుల కోసం విశ్రాంతి స్థలాలను నెలకొల్పాలని సూచించారు. జిల్లాలో ఈ ఏడాది ఇప్పటివరకు 524 రహదారి ప్రమాదాలు నమోదయ్యాయని వెల్లడించారు. రోడ్డు భద్రతా నియమాలపై ప్రజల్లో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ డి.పృథ్వీరాజ్ కుమార్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

కాలనీలో ముంపును పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

కాలనీల ముంపు సమస్య పట్టదా..?

- నీరు నిల్వతో రోగాల బారిన ప్రజలు
- అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించాలి
- సమస్య పరిష్కరించకపోతే దశల వారీ పోరాటం
- ముంపు కాలనీల్లో సిపిఎం ప్రతినిధి బృందం పర్యటన

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

శ్రీకాకుళం నగరంలోని పలు కాలనీల్లో ముంపు సమస్య ప్రభుత్వానికి... కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడుకు పట్టదా అని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, పట్టణ కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, పట్టణ పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ ఎం.గోవర్ధనరావు ప్రశ్నించారు. నగరంలోని డిసిసిబి కాలనీ, జగన్నాథనగర్, గోవిందనగర్, రామ్‌నగర్, ఇందిరానగర్, జగ్గయ్య కాలనీ, వంశధార కాలనీ, తిలక్ నగర్ కాలనీ, కొన్నావీధి తదితర ముంపునకు గురైన కాలనీల్లో సిపిఎం ప్రతినిధి బృందం సోమవారం పర్యటించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షం పడితే నాగావళి నదికి శ్రీకాకుళం నగరం ఉప నదిగా మారిపోతోందని, నెలల తరబడి నీరు నిల్వ ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మూడుసార్లు ఎంపీగా గెలిచి, ప్రస్తుతం కేంద్రమంత్రిగా ఉన్న కింజరాపు రామ్మోహన్ నాయుడు శ్రీకాకుళం నగర ముంపు సమస్యను ఎందుకు పరిష్కరించడం లేదని ప్రశ్నించారు. నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించి నగర ప్రజలకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆస్తి పన్ను, నాలా పన్ను పేరుతో కోట్లాది రూపాయలు ప్రజల వద్ద నుంచి వసూలు చేస్తోందని, మౌలిక వసతులు మాత్రం కల్పించడం లేదని విమర్శించారు. శ్రీకాకుళం నగరపాలక సంస్థ గత ఆర్థిక సంవత్సరంలో రూ.24 కోట్లు, ఈ సంవత్సరంలో ఇప్పటివరకు రూ.29 కోట్లు నగరంలో పన్నులు వసూలు చేసిందని తెలిపారు. ప్రజల నుంచి పెద్దఎత్తున పన్నులు వసూలు చేస్తున్నా సౌకర్యాల కల్పనపై దృష్టిసారించడం లేదని విమర్శించారు. పూర్తిస్థాయిలో డ్రైనేజీ వ్యవస్థను నిర్మించకపోవడంతో, నీరు నిల్వ ఉండి ప్రజలు రోగాల బారిన పడుతున్నారని తెలిపారు. కాలనీల్లో మురికి నీరుతో దోమలకు ఆవాసాలుగా మారిందని, ఇళ్లల్లోకి పాములు చేరుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిరంతరం రోడ్లపై నీరు ప్రవహించడంతో రవాణా సౌకర్యం లేక విద్యార్థులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వానికి పట్టడం లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం అండర్ గ్రౌండ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేయాలని, తక్షణం యుద్ధప్రాతిపదికన కాలువల మరమ్మతులు చేసి, నీరు డ్రైనేజీల ద్వారా వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాలనీల ముంపు సమస్య పరిష్కరించకపోతే దశల వారీ పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు, జిల్లా కమిటీ సభ్యులు సిహెచ్.అమ్మన్నాయుడు, కె.సూరయ్య, ఎన్.అప్పన్న, కె.అప్పారావు, ఎం.ఆదినారాయణమూర్తి, కాలనీవాసులు సీపాన వెంకటరావు, బి.రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులు చేయాలి

'మీకోసం'కు 93 వినతులు

వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ఎచ్చెర్ల మండలం కొత్తపేట, రుప్పపేట, ముద్దాడ, సెగిడిపేట, అంబేద్కర్ నగర్, కొత్తపేట, కొయ్యవానిపేట, చిన్నకొయ్యవానిపేట రోడ్డు మరమ్మతులు చేయాలని స్థానికులు బి.రామారావు, పైడి సత్యంతో పాటు పలువురు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను కోరారు. కొన్ని రోడ్డులకు టెండర్లు పూర్తి చేసినా పనులు ప్రారంభించడం లేదని, ప్రస్తుతం రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. నగరంలోని జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం)లో వినతిపత్రం అందించారు. జిల్లావ్యాప్తంగా పలు సమస్యలపై మీకోసంకు 93 వినతులు వచ్చాయి. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి కలెక్టర్ వినతులు స్వీకరించారు. యూరియా కొరతతో పంటల సాగుకు ఇబ్బందులు పడుతున్నామని, అవసరం మేరకు యూరియాను సరఫరా చేయాలని ఎచ్చెర్ల మండలం ముద్దాడకు చెందిన శ్రీనుబాబు వినతిపత్రం అందజేశారు. మెళియాపుట్టి మండలం తుమికొండ, రామచంద్రాపురంలో కోతులు సమస్యగా మారాయని, ఉద్యాన పంటలు, వరి పంటను పాడు చేస్తున్నాయని, అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకుని కోతుల బారి నుంచి పంటలు కాపాడాలని ఆ గ్రామాలకు చెందిన పలువురు కోరారు. తనకు గుండె జబ్బు ఉందని, రూ.15 వేల పింఛను మంజూరు చేయాలని శ్రీకాకుళం నగరానికి చెందిన వికలాంగుడు షేక్ ఏసేపు వినతిపత్రం అందజేశారు.

కలెక్టరేట్ సమీపంలో నగరపాలక సంస్థ 150 అడుగుల రోడ్డుకు ప్రతిపాదనలు సిద్ధం చేసిందని, ఈ రోడ్డు వల్ల సమీపంలో కొనుగోలు చేసిన లేఅవుట్‌లోని ప్లాట్‌లు, ఇళ్లు నష్టపోతాయని బాధితులు ఫిర్యాదు చేశారు. ఈ మాస్టర్‌ప్లాన్‌ను విరమించుకోవాలని కోరారు. వీటితోపాటు మిగతా వ్యక్తిగత, సామూహిక సమస్యలపై వినతులు వచ్చాయి. అనంతరం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ బ్యానర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు.

తగ్గిన జిఎస్‌టి రేట్లు పక్కాగా అమలు

జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

జిఎస్‌టి ద్వారా తగ్గించిన రేట్లు పక్కాగా అమలు చేయాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాద్ అహ్మద్‌ఖాన్ అన్నారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో సోమవారం ప్రచార పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే నెల 19 వరకు నిర్వహిస్తున్న సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ఇంటింటికీ చేరేలా అన్ని ప్రభుత్వ విభాగాలు పనిచేస్తాయని అన్నారు. కార్యక్రమంలో విశాఖపట్నం నోడల్ అధికారి డిప్యూటీ కమిషనర్ ఎం.స్వప్నదేవి, అసిస్టెంట్ కమిషనర్లు ప్రసాద్, వి.చంద్రకళ, డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ ఆర్.వేణుగోపాల్, వాణిజ్య పన్నులశాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను విడుదల చేస్తున్న జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

రైతు శ్రేయస్సే లక్ష్యంగా పనిచేయాలి

రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

ప్రమాణ స్వీకారం చేస్తున్న శేషగిరిరావు

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

రైతు శ్రేయస్సే లక్ష్యంగా సమష్టి కృషితో పనిచేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. కోటబొమ్మాళి వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులో సోమవారం నిర్వహించిన వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకమండలి ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులు పండించిన ఉత్పత్తులను దళారుల బారిన పడకుండా, ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర కల్పించి మేలు చేసేలా సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. వ్యవసాయ కమిటీల అభివృద్ధి, బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అనంతరం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బగాది శేషగిరిరావుతో పాటు 14 మంది ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో పిఎసిఎస్ మాజీ చైర్మన్ కింజరాపు హరివరప్రసాద్, కొత్తమ్మతల్లి ఆలయ కమిటీ చైర్మన్ కోరాడ గోవిందరావు, బోయిన రమేష్, మార్కెట్ కమిటీ కార్యదర్శి కె.రామారావు, పర్యవేక్షకులు టి.హేమలత పాల్గొన్నారు.

కోటబొమ్మాళిలోని పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా దర్బార్‌లో మంత్రి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా అధికారులు పనిచేయాలని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో వాచ్‌మెన్‌గా పనిచేస్తూ ఇటీవల మృతి చెందిన డి.కోటి భార్యకు రూ.50 వేల నగదును అందజేశారు.

నగరపాలక సంస్థ కార్యాలయాన్ని ముట్టడించిన సచివాలయ ఉద్యోగులు

ఇలా అయితే పనిచేయడం కష్టం

- అధికారుల వేధింపులు ఆపాలి
- మున్సిపల్ కార్పొరేషన్‌ను ముట్టడించిన సచివాలయ ఉద్యోగులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ఒకవైపు పెరిగిన పనిభారం, మరోవైపు అధికారుల వేధింపులతో సతమతమవుతున్నామని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల జెఎసి నాయకులు అన్నారు. పనిభారం తగ్గించాలని, అధికారుల వేధింపులు ఆపాలని, నిలిపివేసిన జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ వార్డు సచివాలయ ఉద్యోగులు శ్రీకాకుళం నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద సోమవారం బైఠాయించి ముట్టడించారు. నగరంలోని అన్ని వార్డు సచివాలయ ఉద్యోగులు విధులు బహిష్కరించి నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెఎసి నాయకులు మాట్లాడుతూ ఇన్‌ఛార్జీల పేరుతో రెండు, మూడు సచివాలయాల బాధ్యతలు అప్పగిస్తున్నారని చెప్పారు. సర్వేలతో పనిభారం పెరిగిందన్నారు. సెలవు రోజుల్లోనూ పని చెప్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక యాప్‌ల్లో సర్వేలు చేయాలంటున్నారని చెప్పారు. పనివేళలు పాటించకుండా వీడియో కాన్ఫరెన్స్‌లు పెడుతున్నారని తెలిపారు. సెలవులు, పండగలు, ఆదివారాల్లో విధుల నుంచి మినహాయించాలని డిమాండ్ చేశారు. డెప్యుటేషన్ వేసిన ఉద్యోగులను మాతృసంస్థకు అప్పగించాలని కోరారు. సచివాలయ ఉద్యోగులకు నేషనల్ ఇంక్రిమెంట్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. జీతాలు నిలుపుదల వెనక్కి తీసుకోవాలని, లేదంటే భవిష్యత్‌లో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. యూనియన్ నాయకులతో అసిస్టెంట్ ప్లానింగ్ కమిషనర్ పి.పద్మావతి మాట్లాడి ఉన్నతాధికారుల దృష్టికి సమస్యలు తీసుకెళ్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు బి.మధుబాబు, పి.మరీష్, బి.జగదీష్ బాబు, జి.సురేంద్ర, పి.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే అభివృద్ధి

మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు

మాట్లాడుతున్న గిరిబాబు

ప్రజాశక్తి- పలాస

పాలకవర్గ సభ్యులు, అధికారులు సహకారంతోనే అభివృద్ధి సాధ్యమని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. కాశీబుగ్గ-పలాస మున్సిపల్ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన సోమవారం సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాలకవర్గం ఏర్పడి నాలుగేళ్ల ఏడు నెలలు అవుతుందని అన్నారు. ఈ పాలనలో మున్సిపాలిటీని ఎంతో అభివృద్ధి చేశామన్నారు. కెటి రోడ్డు విస్తరించి సుందరంగా తీర్చదిద్దామన్నారు. ఉద్దానం ప్రాజెక్టు ద్వారా అనుసంధానం చేయడం వల్ల 70 వేల మందికి తాగునీరు అందించామన్నారు. రోడ్లు, కాలువలు ఏర్పాటు చేశామన్నారు. అధికార పార్టీ కౌన్సిలర్ తంగుడు ఆశాలత మాట్లాడుతూ తమ వార్డులో కామాక్షమ్మ ఆలయం వద్ద కల్వర్టర్ మరమ్మతుకు గురికావడంతో ప్రజలు ఎంతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఎన్నోసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని నిలదీశారు. నాలుగేళ్లలో తమ వార్డులు ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టలేదని సభ దృష్టికి తీసుకొచ్చారు. తమ వార్డు అంటే చిన్నచూపు చూస్తున్నారంటూ అంసతృప్తి వ్యక్తం చేస్తూ... వాకౌట్ చేశారు. కౌన్సిలర్ శర్వాని గీత మాట్లాడుతూ ప్రభుత్వ సమావేశాలకు హాజరు కాకపోతే సభ్యులను గ్రూపుల నుంచి తొలిగిస్తామని బెదిరిస్తున్నారని, తమ వార్డులోని మహిళా సంఘ సభ్యులు తమ వద్ద ఆవేదన వ్యక్తం చేశారని అన్నారు. మహిళలు అన్ని సమావేశాలకు హాజరుకాలేరని, దానిని నాయకులు, అధికారులు అర్థం చేసుకోవాలని కోరారు. ఇలా బెదిరింపులు చేపట్టడం సరైన పద్ధతి కాదన్నారు. కౌన్సిలర్ కర్రి మాధవరావు మాట్లాడుతూ తమ వార్డులో రోడ్లు, కాలువల పనులకు శంకుస్థాపన చేశారు తప్పితే పనులు పూర్తి చేయలేదని తెలిపారు. అక్కుపల్లి రోడ్డు అంతా గోతులతో అధ్వానంగా ఉందన్నారు. దీనిపై చైర్మన్ మాట్లాడుతూ అక్కుపల్లి రోడ్డు ఆర్అండ్‌బికి చెందుతుందని సమాధానం ఇచ్చారు. ఈ రోడ్డు దుస్థితిపై ఎంపీ, ఎమ్మెల్యే, జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కమిషనర్ ఎన్.రామారావుకు సూచించారు. కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్ మాట్లాడుతూ ఈ పాలకవర్గంలో 90 శాతం వరకు విజయం సాధించామన్నారు. పలాస రైల్వే వంతెన వసుల కూడా ప్రారంభమయ్యాయని తెలిపారు. మార్చి నాటికి పూర్తి చేయాలని సంకల్పంతో కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే గౌతు శిరీష కృషి చేస్తున్నారని అన్నారు. కో-ఆప్షన్ సభ్యుడు బమ్మిడి సంతోష్ కుమార్ మాట్లాడుతూ శనిశ్వరి ఆలయానికి వెళ్లే దారితో ప్రభుత్వ స్థలం ఆక్రమించి రోడ్డు, కాలువను ఒక ప్రైవేటు వ్యక్తి నిర్మించుకుంటే అధికారులు దీనిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. దీనికి కమిషనర్ సమాధానమిస్తూ... దీనిపై రెవెన్యూ అధికారులతో సర్వే కూడా చేపట్టామని అన్నారు. ఆ నిర్మాణం జిరాయితీలో ఉందని సర్వేయర్ నివేదిక అందించారని అన్నారు. మీకు ఏమైనా అనుమానాలు ఉంటే ఆర్జటి యార్డు కింద వివరాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ మీసాల సురేష్‌బాబు, కౌన్సిలర్లు బెల్లాల శ్రీను, సవర సోమేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, జోగ త్రివేణి, బల్ల రేవతి, సనపల సింహాచలం, అంబటి మాధురి పాల్గొన్నారు.

పిడుగుపాటుకు వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కొత్తూరు

పిడుగుపాటుకు మండలంలోని సిరుసువాడకు చెందిన కోటిలింగాల హరిశ్చంద్రుడు (55) సోమవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... కూరగాయలు అమ్ముకుని కుటుంబాన్ని పోషిస్తున్న హరిశ్చంద్రుడు పార్వతీపురం మన్యం జిల్లాలోని సీతంపేట సంతకు సోమవారం వెళ్లి వచ్చాడు. సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షానికి భారీ శబ్దంతో ఇంటి పెరట్లోని కొబ్బరి చెట్టుపై పిడుగు పడింది. చెట్టు పక్కనే ఉన్న పూరి పాక కాలి బూడిదైంది. ఆ సమీపంలో ఉన్న హరిశ్చంద్రుడు ఒక్కసారిగా అపస్మారక స్థితికి చేరుకోవడంతో కుటుంబ సభ్యులు స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాతపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతునికి భార్య అనసూయ, కుమారుడు ఖగేష్, కుమార్తెలు సుగుణ, లోఖ్మీ ఉన్నారు. కుటుంబ పెద్ద దిక్కును కోల్పోవడంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహమ్మద్ అమీర్ అలీ తెలిపారు.

హరిశ్చంద్రుడు మృతదేహం

THE HONOURABLE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE (SENIOR DIVISION) AT SRIKAKULAM
O.S. NO: 5/2025

BETWEEN:
Shriram Finance Limited rep, by its GPA Holder.G. SURESH. ...... Plaintiff

AND
Pinninti Suneetha @K Suneetha and Others ...Defendants

To
01) SUNEETHA PINNINTI @ K.Suneetha W/o Rama Krishna Late Pinninti, Aged 31 YEARS, H.No.2-43, Uppara Peta Village, Narasannapeta, Srikakulam District, Mobile-7032969425.
02) RAMA KRISHNA VEERAVALLI, S/o Ravi Sankar, Aged 29 Years, D.No.31-2-G-1, Bankers Colony, Siva Balaji Temple, Srikakulam Town, Srikakulam District.
03) RAMA KRISHNA KOMMURU S/o Rama Rao, Aged 38 Years, Plot No.2B, Sai Satya Towers, Illisipuram, Srikakulam, Mobile-950552525, PIN 532001.

NOTICE

Take notice that the above suit is posted for your notice and that you are hereby appear before the Honourable court of **THE PRINCIPAL CIVIL JUDGE (SENIOR DIVISION)**, Srikakulam on **08.10.2025** at 10-30 A.m personally or through Advocate. If you fails to appear the matter will be decide exparte.

MANCHU JANARDHANA RAO, Advocate
Jami Thota, Visakha 'A' Colony,
Srikakulam Town & Dist.
Phone : 9849178948, 9704986271, 9866509550

మహారాజశ్రీ శ్రీకాకుళం ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో.
E.P. No: 32/2024 in O.S. No: 47/2022

Between:-
పాగోటి అప్పాజి .....DHR-Plaintift
And:-
కోరాడ గణేశ్వరరావు @ గణేష్ .....JDR-Defendent

TO:
JDR:- శ్రీ కోరాడ గణేశ్వరరావు @ గణేష్, S/o లేటు వెంకట భాగయ్య, R/o కలివరపుపేట వీధి, నరసన్నపేట టౌన్, పోస్టు మరియు మండలం, శ్రీకాకుళం జిల్లా.

నోటీసు

పై నెంబరు గల పిటీషన్ కోర్టు వారు యిచ్చిన డిక్రీని అమలు చేయుటకు గాను, డిక్రీ హోల్డర్-వాది మీ పై వేసిన పిటీషన్ మీయొక్క హాజరు నిమిత్తం **తే 17-10-2025 దీన వాయిదా వున్నది.** కావున మీరు వాయిదా రోజున, మీరు వ్యక్తిగతంగా గాని, లేదా వకీలు ద్వారా గాని హాజరై మీకు గల అక్షేపణలు మహారాజశ్రీ కోర్టు వారి ముందు తెలియపరుచుకోవలెను. లేని ఎడల మీకు వ్యతిరేకంగా (Ex-party) తీర్పు చెప్పబడునని యిందు మూలముగా తెలుసుకోవలయును.

(మహారాజశ్రీ కోర్టువారి ఉత్తర్వులు ప్రకారం)

నరసన్నపేట,
27-09-2025.

రెడ్డి. జగన్నాథరావు
న్యాయవాది, నరసన్నపేట
ఫోన్: 9866310819.

IN THE HONOURABLE COURT OF THE 1ST ADL. DISTRICT JUDGE AT SRIKAKULAM.
E.P.12/2020 IN A.R.C. 405/2017

BETWEEN:
M/s Shriram City Union finance Ltd having its Registered office at 123, Angappa Naiken street Chennai and having its Administrative office At 3-6-478, 4th floor Anand Estates Liberty road Himayath nagar, Hyderabad, having its branch Office at Palasa Represented by its GPA Sri P.Ravindra represented by its G.Suresh ...Decree Holder

AND
Muvvala Deva & Others ...Judgement Debtor

To
R1) Muvvala Deva, S/o Ravana, Hindu, Age 45 years, R/o D.No.1-323, Mangali Veedhi, Vajrapu Kotturu mandal, Laxmidevpeta @ Nuvvala Revu, Srikakulam.
R2) Muvvala Balakrishna, S/o Ramana Hindu, aged 34 years. R/o D.No. 1-323. Mangaliveedhi, Vajrapukottu Mdl. Laxmidevpeta @ Nuvvalarevu, Srikakulam.
R3) L. Damodhar, S/o Thavudu, Hindu, aged 43 years, R/o H.NO, 16-1-128, Bathula Street, Palasa, Srikakulam

AGAINST WHOM IT HAS BEEN EXECUTION IS SOUGHT AGAINST THE JDR NO. 1

వేలం ప్రకటన

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా, ఈ దిగువ షెడ్యూలు ఆస్తిని పై నెంబరు అమలులో అవార్డు సొమ్ము, వడ్డీ మరియు ఇతర ఖర్చులు రాబట్టే నిమిత్తం పైన ఉదహరించిన న్యాయస్థానంలో తేది 13-10-2025 ఉదయం గం॥ 10.30 ని॥ల నుండి సాయంత్రం 5 గం॥ల మధ్య కాలంలో బహిరంగంగా వేలం వేయబడును. కావున కావలసినవారు ఆ సమయంలో వేలంలో పాల్గొన వచ్చునని ఇందుమూలంగా తెలియపర్చడమైనది.

PETITION SCHEDULE FILED BY THE DECREE HOLDER MOST RESPECTFULLY SHOWETH AS FOLLOWS:
Srikakulam District, Vajrapu Kotturu Md, Kasibugga Sub Registar, Vajrapu Kotturu Panchayat, Meela Kotturu alias Vajrapu Kotturu Village covered by S.No. 484/13, out of Ac 0.90 cents, 2nd row from north, on the Southern side East to West 180 feet or 54.9 meters and North to South 48 feet or 14.64 meters totaling land of 960 Sq. yards or 806.4 Sq. meters is bounded by: **East:** Chakali Pond bund, **West:** Property Sold to M. Deva, **South:** property sold to B. Raghunadh and B. Raghu, **North:** Site left for road.

DHR value : 5,00,000/-
Amine Value : 4,00,000/-
Hearing date : 13.10.2025

MANCHU JANARDHANA RAO, Advocate
Jami Thota, Visakha 'A' Colony, Srikakulam Town & Dist.
Ph. No : 9849178948, 9704986271
9866509590, 9849824246

IN THE HONOURABLE COURT OF THE 1st ADDITIONAL DISTRICT JUDGE AT SRIKAKULAM.
E.P. 133/2019 IN A.R.C. 196 /2015

BETWEEN:
M/s Shriram City Union finance ltd having its Registered office at 123, Angappa Naiken Street, Chennai, and having its Administrative office At 3-6-478, 4th floor, Anand Estates Liberty road Himayath Nagar, Hyderabad, having its branch Office at Srikakulam represented by its GPA Sri. K.V.Ramana, Now Represented by its GPA Holder Sri. P.Jagadeswara Rao ..Decree Holder

AND
K.TIRUMALA RAO & ANOTHER ..Judgment Debtor
R1. K. Tirumala Rao, S/o Krishna Murthy D.No.1-187, Venkateswara Rao Colony Tekkali (Vill. & Mandal), Srikakulam Dist.
R2. K. Ramprasad, S/o Appa Rao, Bhavani Nagar Tekkali (Vill. & Mandal), Srikakulam Dist.

వేలం ప్రకటన

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా, ఈ దిగువ షెడ్యూలు ఆస్తిని పై నెంబరు అమలులో అవార్డు సొమ్ము, వడ్డీ మరియు ఇతర ఖర్చులు రాబట్టే నిమిత్తం పైన ఉదహరించిన న్యాయస్థానంలో తేది 14-10-2025 ఉదయం గం॥ 10.30 ని॥ల నుండి సాయంత్రం 5 గం॥ల మధ్య కాలంలో బహిరంగంగా వేలం వేయబడును. కావున కావలసినవారు ఆ సమయంలో వేలంలో పాల్గొన వచ్చునని ఇందుమూలంగా తెలియపర్చడమైనది.

PETITION SCHEDULE FILED BY THE DECREE HOLDER MOST RESPECTFULLY SHOWETH AS FOLLOWS :
Schedule-I (property covered under document No 948 / 2012) Srikakulam dist tekkali sub-registry. Tekkali mandalam, Parusurampuram Panchayath and village accounts two bits of dry land covered by S.No 42/1A an extent of A.c 0.48 cents and S.No. 44 / 2008 an extent of A.c. 0.29 cents totaling an extent of A.c.0.77 cents of vacant land is bounded by.
Item No 1: An extent of A.c 0.48 Cents covered by S.No 42/1A is Bounded by **East:** wet land of Korada Attachhalamma, **South:**Water flowing canal, **West:** wet land of Thadina Rama Swamy, **North:** wet land of Thadina Rama Swamy
Item No 2: An extent of A.c 0.29 Cents covered by S.No 44/8 is Bounded by, **East:** wet land of Bandapu Sreeramulu, **South:** Water flowing canal, **West:** wet land of Thadina Rama Swamy, **North:** wet land of Sadhu Charam Mahapatro.
Schedule-II (property covered under document No 1007/2012), Srikakulam district, Tekkali sub-registry, Tekkali mandalam, Akkavaram Panchayath Syamsundarapuram village accounts S.No 290/1 an extent of A.c.0.25 out of total Extent of A.c.1.00 cents southern side mango tope is bounded By **East:** Dry land of Gunta Vanamma & Jagati Metturalli Etc., **South:**Mango tope of Potnuru Savitramma, **West:** dry land of Vallabha Bharamaramba, **North:** Dry land of Dasari Padmavathi.

DHR value : 13,00,000/-
Amine Value : 30,00,000/-
Hearing date : 14-10-2025
Further Hearing date : 24-10-2025

MANCHU JANARDHANA RAO, Advocate
Jami Thota, Visakha 'A' Colony, Srikakulam Town & Dist.
Phone No : 9849178948, 9704986271,
9866509590, 9849824246

ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్‌పి మహేశ్వరరెడ్డి

ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి

ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ప్రజా ఫిర్యాదులు స్వీకరణ, పరిష్కారం కార్యక్రమంలో (పబ్లిక్ గ్రీవెన్స్)లో స్వీకరించే ప్రజా ఫిర్యాదులు పూర్తిస్థాయిలో పరిష్కరించాలని, ఆయా ఫిర్యాదులపై విచారణ చేసి అర్జీదారులు సంతృప్తి పొందేలా బాధితులకు న్యాయం చేయాలని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి పోలీసు అధికారులకు ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక కార్యక్రమంలో 44 మంది నుంచి ఫిర్యాదులు స్వీకరించి వారితో ముఖాముఖి మాట్లాడారు. ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకొని పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. ఫిర్యాదుదారుల అర్జీలు, వారి వివరాలు సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్‌కాల్ (జూమ్ కాన్ఫరెన్స్) ద్వారా తక్షణమే సంబంధిత పోలీసు అధికారులకు తెలియజేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని అదేశించారు. ఆయా ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను నిర్ణీత సమయంలో జిల్లా పోలీసు కార్యాలయానికి నివేదిక రూపంలో పంపించాలన్నారు.

నరసన్నపేట : అక్షరాభ్యాసంలో పాల్గొన్న చిన్నారులు

సామూహిక అక్షరాభ్యాసాలు

కవిటి: భారతీయ విద్యా కేంద్రం ఆధ్వర్యాన ఆర్ష విజ్ఞాన భారతీ పాఠశాలలో సోమవారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. బొబ్బిలి కృష్ణారావు-కావ్య దంపతుల సమక్షంలో తెలుగు పండితులు పి.బి.ఎల్.కె.శర్మ సరస్వతీ పూజ నిర్వహించారు. అనంతరం దసరా సందర్భంగా బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు. బివికె సమితి సహ సైక్షణిక డి.రాజశేఖర్ ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.అనిల్, సిబ్బంది శిరీష, ఢిల్లీరావు, సుహాసిని, జ్యోతి, అంజలి, రాజేశ్వరి, ఝాన్సీ, నిర్మల, మాదికమ్మ, కృష్ణకుమార్, లక్ష్మి, ధర్మారావు పాల్గొన్నారు.

నరసన్నపేట : స్థానిక విజ్ఞాన భారతిలో 12 మందికి అక్షరాభ్యాసం చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు జామి రామచంద్రరావు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు సత్యంరాజు, కరస్పాండెంట్ డాక్టర్ సురేష్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు ఢిల్లేశ్వరరావు, ఉపాధ్యాయులు సూర్యనారాయణ, శ్రీదేవి, అనురాధ, అంజలి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న భాస్కరరావు

సిఎం స్వనిధిపై అవగాహన

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం మెప్మా ఆధ్వర్యాన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన సిఎం స్వనిధి 2.0 'లోక కళ్యాణ్ మేళా' పథకంపై సోమవారం టౌన్ మిషన్ కో-ఆర్డినేటర్ భాస్కరరావు అధ్యక్షతన అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా మెప్మా ఐబి బి.రాము మాట్లాడుతూ వీధి విక్రయదారులు, చిరు వ్యాపారులు సిఎం స్వనిధి 2.0 ద్వారా మూడు విడతలు రుణ సౌకర్యం పొందవచ్చని తెలిపారు. మొదటి విడతలో రూ.15 వేలు, రెండో రూ.25 వేలు, మూడో విడతలో రూ.50 వేలు వరకు రుణాలు అందనున్నట్లు వివరించారు. వీధి వ్యాపారులు డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించాలని సూచించారు. ఇలా చేస్తే క్యాష్ బ్యాక్ వంటి ప్రయోజనాలు లభించనున్నాయని చెప్పారు. ఇప్పటివరకు రుణాలు పొందని అర్హులైన లబ్ధిదారులు మెప్మా కార్యాలయాన్ని సంప్రదించి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. బ్యాంకులు అర్హులైన వారికి వెంటనే రుణాలు మంజూరు చేయాలని సూచించారు. డిసిసిబి బ్యాంకు మేనేజర్ అనిత పండా బ్యాంకుల ద్వారా అమలవుతున్న పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఎస్‌బిఐ మేనేజర్ మనజ్‌వర్మ, మెప్మా సిటి మిషన్ మేనేజర్ మోహనరావు, ఇండియన్, ఎపిజిబి బ్యాంకుల మేనేజర్లు, మెప్మా సిబ్బంది సంతోష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న విజయకృష్ణ

రుణాలు సకాలంలో చెల్లించాలి

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

రైతు సేవా సహకార సంఘం రుణాలు సకాలంలో అభివృద్ధి చెందేందుకు రైతులు సహకరించాలని చైర్‌పర్సన్ బొంతు విజయకృష్ణ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో 2025 - 26 అర్ధసంవత్సర 68వ సాధారణ మహా జనసభ సమావేశం సంఘ ఆవరణలో మేనేజింగ్ డైరెక్టర్ కె.స్పందన ప్రపూర్ణ చౌదరి అధ్యక్షన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘంలో వ్యవసాయ, వ్యాపార ఆర్థిక పురోభివృద్ధికి తగు ప్రణాళిక రచించిన వాటిని అమలు జరుపుటకు సభ్యుల సలహాలు, సూచనలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మొండి బకాయిలు ఉన్న గ్రామాల్లో సమావేశం ఏర్పాటు చేసి చెల్లించేందుకు అందరు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పర్సన్ల లంక వెంకటరమణ, పులపా వెంకటరత్నం, సిబ్బంది పిసిని సూర్యనారాయణ, బొంతు శ్రీధర్, పైడి శ్రీనివాసరావు, ఎన్.సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం పురపాలక సంఘం పరిధిలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా రామకృష్ణ రీడింగ్ రూమ్ అండ లైబ్రరీలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. కమిషనర్ రమేష్ ఆధ్వర్యాన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్రకుమార్, మెడికల్ ఆఫీసర్ అఖిల్ మనోహర్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మినీ రిజర్వాయర్ హామీలు నీటిమూటలే

- 20 ఏళ్లుగా ఎదురుచూస్తున్న రైతాంగం
- పట్టించుకోని పాలకులు

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని బుడుమూరు గ్రామంలోని ఉన్న పెద్ద చెరువు నారాయణ సాగరాన్ని మినీ రిజర్వాయర్‌గా తీర్చిదిద్దుతామని ఎన్నికల్లో రాజకీయ పార్టీలు ప్రతీసారి రైతులకు హామీ ఇవ్వడం తర్వాత దానిని గాలికి వదిలేయడం పరిపాటిగా మారింది. గత 20 ఏళ్లపైగా ముఖ్యమంత్రులు రాజశేఖర్ రెడ్డి దగ్గర నుంచి రోశయ్య, కిరణ్‌కుమార్ రెడ్డి, చంద్రబాబు నాయుడు, వైఎస్ జగన్మోహన్ రెడ్డి నుంచి మళ్లీ ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో చంద్రబాబు నాయుడు వరకు ప్రతి ఎన్నికల్లోను తమకు ఓట్లు వేసి గెలిపించాలని రైతులను నమ్మించడం ఓట్లు వేయించుకుని ఎమ్మెల్యేలుగా గెలవడం తీరా గెలిచిన తర్వాత మర్చిపోవడం, వారి చేతుల్లో రైతులు మోసపోవడం జరుగుతూనే ఉంది. 2019 ఎన్నికల ముందు మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ నారాయణ సాగరం మినీ రిజర్వాయర్ కోసం పాదయాత్ర చేపట్టారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో వైసిపి అధికారంలోకి రావడం, ఎమ్మెల్యేగా గొర్లె కిరణ్‌కుమార్ ఎన్నికయ్యారు. ఎమ్మెల్యే అయ్యాక కిరణ్‌కుమార్ బుడుమూరు పెద్దచెరువు నారాయణ సాగరాన్ని

నారాయణ సాగరం పెద్ద చెరువు

మినీ రిజర్వాయర్‌గా తీర్చిదిద్దుతామని చెప్పిన హామీలు నీటి మూటలుగానే మిగిలిపోయాయి. ఇప్పటికి ఐదుగురు ముఖ్యమంత్రులు, నలుగురు ఎమ్మెల్యేలు అయ్యారు. నారాయణ సాగరం మాత్రం ఇప్పటికీ చెరువుగానే ఉండి పోయింది. జిల్లాలోనే పెద్ద చెరువు 318 ఎకరాల్లో చెరువు గర్భం ఉండగా, దీని కింద సుమారు 15 గ్రామాల్లో పదివేలు ఎకరాలకు సాగునీరు అందనుంది. బుడుమూరు, చిన్న రొంపివలస, పెద్దరొంపివలస, చిన్నమురపాక, రాయినింగారి పేట, కేశవరాయపాళెం, ఎచ్చెర్ల మండలం కుప్పిలి వరకు దీని ద్వారా పొలాలకు సాగునీరు అందనుంది. తద్వారా సాగునీరు అందితే సంవత్సరానికి రెండు పంటలు పండే అవకాశం పుష్కలంగా వుంది. దీనికి తోటపల్లి ప్రాజెక్టు, మడ్డువలస ప్రాజెక్టు నుంచి సాగునీరు వచ్చే అవకాశం ఉంది. ఇటువంటి నీటివనరులు ఉన్నప్పటికీ ఈ సమస్యను పరిష్కరించడానికి ప్రభుత్వం దృష్టిలో ఎమ్మెల్యే పెట్టి నిధులు కేటాయించాలని ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తేగాని ప్రభుత్వం దృష్టి సారించదు. సుమారు 15 గ్రామాల్లోని పదివేల ఎకరాల్లో వేలమంది రైతులు సాగుచేసుకొనేందుకు అవకాశం ఉంటుంది.

పర్యాటక కేంద్రంగా అనుకూలం

నారాయణ సాగరం జాతీయ రహదారికి అనుకుని ఉండడం, గట్టు కూడా జాతీయ రహదారికి సమాంతరంగా పొడవునా ఉండడంతో మినీ రిజర్వాయర్‌గా తీర్చిదిద్దితే పర్యాటకంగా అభివృద్ధి చేస్తే ఆదరణ పొందే అవకాశం మెండుగా ఉంది. జాతీయ రహదారిని ఆనుకొని ఉండడంతో పాటు నారాయణ సాగరానికి ఆయకట్టు పొలాలకు మధ్యలో నుంచి జాతీయ రహదారి ఉండడం కలిసి వచ్చే అంశం. అటువైపు పచ్చనిపంట పొలాలతో ప్రకృతిని సంతరించే అందంతో పర్యాటకులకు కనువిందు చేసే విధంగా ఉంటుంది. ప్రస్తుత సిఎం చంద్రబాబు నాయుడు గతంలో ఇచ్చిన హామీని అమలు చేసేందుకు కృషి చేసి బుడుమూరు నారాయణ సాగరాన్ని మినీ రిజర్వాయర్‌గా తీర్చిదిద్దడానికి నిధులు కేటాయించాలని రైతులు కోరుతున్నారు.

స్టాల్‌ను ఏర్పాటు చేసిన అంగన్వాడీలు

పౌష్టికాహారంపై అవగాహన

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలోని రణస్థలం సెక్టార్ పరిధిలోని సీతంవలసలో 8 రాష్ట్రీయ పోషణ మాసం కార్యక్రమం అంగన్వాడీ సూపర్‌వైజర్ టి.మంగమ్మ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, స్థూలకాయ నివారణ, చక్కెర, నూనె వినియోగంపై అవగాహన కల్పించారు. అదేవిధంగా పౌష్టిక ఆహారంపై సలహాలు, సూచనలు అందించారు. గర్భిణులు, బాలింతలు ఆకుకూరలు, కూరగాయలు, చిరుధాన్యాలు తీసుకోవాలని, దానివలన రక్తహీనతను నివారించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏర్పాటు చేసిన అంగన్వాడీ స్టాల్‌ను అధికారులు, నాయకులు సందర్శించారు. కార్యక్రమంలో ఆశా, అంగ న్వాడీ కార్యకర్తలు, వైద్యసిబ్బంది, ఎఎన్‌ఎంలు పాల్గొన్నారు.

నేడు విద్యారంగ సంస్కరణలపై సదస్సు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

యుటిఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని యుటిఎఫ్ భవన్‌లో విద్యారంగ సంస్కరణలు, ప్రభావాలపై సదస్సు నిర్వహించనున్నట్లు విశ్రాంత డైట్ ప్రిన్సిపాల్ కొత్తకోట అప్పారావు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మతో పాటు పలువురు విద్యారంగ నిపుణులు హాజరు కానున్నారన్నారు. కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు.

చెత్త బుట్టల పంపిణీ

ప్రజాశక్తి- పలాస

మండలంలోని కిష్టుపురంలో స్వర్ణాంధ్రా, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శ్రీశయన సాధికారిక కమిటీ మెంబర్ బూర్లె కృష్ణంరాజు సోమవారం చెత్త బుట్టను పంపిణీ చేశారు. తడి, పొడి చెత్తలను వేర్వే చేసి చెత్త బుట్టల్లో వేయాలన్నారు. అదే రోజు మీ ఇంటి ముందుకొచ్చిన రిక్షాలో చెత్త వేయాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో టిడిపి మండల కార్యదర్శి సంతోష్‌మార్ నాయుడు, టిడిపి గ్రామ అధ్యక్షులు తులీసీరావు, బూర్లె ఢిల్లీశ్వరరావు, బూర్లె ప్రసాదరావు, కంచరాన సాయి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మందులను అందజేస్తున్న సర్పంచ్ పోలినాయుడు

వైద్య శిబిరానికి స్పందన

పొందూరు: మండలం పిల్లలవలసలో సర్పంచ్ బుడుమూరు పోలినాయుడు ఆధ్వర్యంలో సోమవారం రాగోలు జెమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన సుమారు 110 మందికి ఉచితంగా వైద్య పరీక్షలను నిర్వహించి మందులను అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు ఎస్.అనూష, కె.సీతారాం, స్టాఫ్‌నర్స్ ఎస్.శైలజ, పిఆర్‌ఒ ఐ.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

లావేరు: మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ పరిధిలోని పట్నావానిపేటలో ఉన్న సహజ యోగా ధ్యాన మందిరంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవోపేతంగా జరుగుతున్నాయి. సోమవారం మందిర ప్రాంగణంలో హవన్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సహజ యోగులు మాట్లాడుతూ యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. ప్రతిరోజూ ధ్యానం చేయడంతో మానసిక, శారీరక ఆరోగ్యాన్ని సాధించవచ్చునని తెలిపారు.

మాట్లాడుతున్న ప్రసాదరావు

కోతుల నుంచి రక్షణ కల్పించాలి

మెళియాపుట్టి: మండలంలోని పరశురాంపురం పంచాయతీ పరిధిలోని తూముకొండ వ్యవసాయ పంటలను కోతులు నాశనం చేస్తున్నాయని, వాటి బారి నుంచి విముక్తి కలిగించాలని సర్పంచ్ తెంబూరు ప్రసాదరావు కోరారు. ఈ మేరకు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ కోతుల ఉధృతి కారణంగా పొలాల్లో సాగు చేసిన పంటలను ధ్వంసం చేస్తున్నాయని అన్నారు. దీంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని తెలిపారు. కోతుల అల్లర్లను అరికట్టేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు మన్మథరావు, వసంతరావు, గేదెల భాస్కరరావు, శ్యాము, వినోద్ పాల్గొన్నారు.

గుండె ఆరోగ్యం కీలకం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

గుండె పదిలం మన బాధ్యతని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఎస్‌పి ప్రసాదరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో సోమవారం కిమ్స్ ఆస్పత్రి ఆధ్యర్యంలో ఏర్పాటు చేసిన ప్రపంచ హృదయ దినోత్సవ వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. చక్కని ఆరోగ్య నియమాలు పాటిస్తూ, నిత్యం యోగా, వ్యాయామాలు, నడక వంటివి జీవితంలో భాగం చేసుకుంటే గుండెజబ్బులు నుంచి కొంతవరకు ఉపశమనం పొందటానికి అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో కిమ్స్ ఆస్పత్రి ఎండి డాక్టర్ గూడేన సోమశేఖర్, లైన్స్‌క్లబ్ సెంట్రల్ చైర్మన్ నటుకుల మోహన్, వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ ప్రతినిధులు గేదెల ఇందిరా ప్రసాద్, శాసపు జోగినాయుడు, యోగా గురువు శ్రీనివాస్, కిమ్స్‌ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీకాకుళం: వృద్ధులతో పాటు యువతలో గుండె సంబంధిత వ్యాధుల ముప్పు వేగంగా పెరుగుతోందని కార్డియాల జిస్టులు డాక్టర్లు అన్నాజీరావు, ఫణీంద్ర సూర్యప్రకాశ్, ఎమర్జెన్సీ ఫిజీషియన్ డాక్టర్ సాగరిక అన్నారు. ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా మెడికవర్ ఆస్పత్రిలో హృదయ ఆరోగ్యంపై సోమవారం అవగాహన కల్పించారు.

శ్రీకాకుళం : అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

ఈ మేరకు రోగులకు, సిబ్బందికి హృదయ ఆరోగ్యంపై విలువైన సూచనలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా మరణాలకు హృదయ వ్యాధులే ప్రధాన కారణమని అన్నారు. మారుతున్న జీవనశైలి, అనారోగ్యకర ఆహారపు అలవాట్లు, అధిక ఒత్తిడి వంటి అంశాలు ఇందుకు దారితీస్తున్నాయని తెలిపారు. నిత్య వ్యాయామం, సమతుల్య ఆహారం, ఒత్తిడి నియంత్రణ, ఆరోగ్యకర జీవనశైలిని అవలంబించడం ద్వారా గుండె సంబంధిత వ్యాధులను నివారించవచ్చని సూచించారు. ప్రజాప్రయోజనార్థం ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకొని మెడికోవర్‌లో రూ.999 ప్రత్యేక వైద్య ఆరోగ్య వైద్య పరీక్షల ప్యాకేజీని ప్రకటించారు.

మెయిన్ రోడ్డులో గోతులు పూడ్చాలి

మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

పట్టణంలో నడి బొడ్డున ఉన్న పాత బస్టాండ్ వద్ద పేరుకుపోయిన గోతులను పూడ్చే చర్యలు చేపట్టాలని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ లాభాల స్వర్ణమణి అధికారులను నిలదీశారు. మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి అధ్యక్షతన సోమవారం కౌన్సెల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బస్టాండ్ కూడలి వద్ద గ్రామ దేవత సంబరాలు సందర్భంగా భారీ స్వాగత గేట్లు ఏర్పాటు చేశారని అన్నారు. ఆ సమయంలో ఏర్పడిన గోతులు పూడ్చకపోవడంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని అన్నారు. దీనిపై కమిషనర్ రమేష్ సమాధానం ఇస్తూ మెయిన్ రోడ్డు తమ పరిధిలో లేదని, అర్‌బిశాఖ పరిధిలోకి వస్తుందని తెలిపారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఆర్అండ్‌బి అధికారులకు లేఖ రాయాలని అన్నారు. అనంతరం 15 ఆర్థిక సంఘం నిధుల నుంచి చేపట్టుతున్న వివిధ అభివృద్ధి పనులకు వచ్చిన టెండర్లను కౌన్సెల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. సమావేశంలో వైస్ చైర్‌పర్సన్ భారతీదివ్య, కో-ఆప్షన్ సభ్యులు పి.విజయకుమార్, సయ్యద్ సుల్తాన్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

వృత్తి విద్యతోనే విద్యార్థుల భవిష్యత్

శిక్షణ ఇస్తున్న తిరుపతిరావు

పోలాకి: విద్యార్థుల సమగ్ర అభివృద్ధి, భవిష్యత్‌ను నిర్దేశించేది ఆచరణాత్మక వృత్తి విద్య అని జిల్లా వృత్తి విద్య కో-ఆర్డినేటర్ బి.తిరుపతిరావు, జి.శంకరరావు, ఎపి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ప్రవీణ అన్నారు. సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యాన విద్యార్థుల్లో నైపుణ్య అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ పాఠశాల స్థాయి నుంచే వృత్తి విద్య కార్యక్రమం అమలు చేస్తుందన్నారు. 9 నుంచి 12వ తరగతి వరకూ చదువుతున్న విద్యార్థులకు ఐటి/ఐటిఇఎస్, ఎలక్ట్రానిక్స్, హెల్త్ కేర్ వంటి విభాగాల్లో ఆచరణాత్మక పరిజ్ఞానం అందించడానికి ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు విద్యతో పాటు ఐటి/ఐటిఇఎస్, ఎలక్ట్రానిక్స్ వంటి వివిధ విభాగాల్లో శిక్షణ పొందుతున్నారని తెలిపారు. ఏడాదిలో మూడుసార్లు ఇంటర్న్‌షిప్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. దసరా సెలవులు సందర్భంగా పోలాకి మండలంలోని వివిధ ఇంటర్ నెట్ సెంటర్లు, ఫొటో స్టూడియోలు, మీసేవలు, ఆధార్ సేవా వంటి కంప్యూటర్ ఆధారిత సేవా కేంద్రాల్లో, ఎలక్ట్రికల్ షాపుల్లో పది రోజుల పాటు విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నామని అన్నారు. అనంతరం విజయవంతంగా శిక్షణ పొందిన విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.రామనాయుడు, పి.మురళీమోహన్ పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌కె చుట్టూ రైతుల ప్రదక్షిణ

అందుబాటులో లేని వ్యవసాయ అధికారులు

ప్రజాశక్తి- మందస

మండలంలోని ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 15 వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తున్నారు. ప్రధానంగా జీవాన్ని ఇచ్చే సందర్భంలో యూరియా కొరత తీవ్రంగా వేధిస్తోంది. ప్రధానంగా అంబుగాం, తాళ్లభద్ర పంచాయతీల్లో అత్యధికంగా సాగు అవుతుంది. రెండు గ్రామ పంచాయతీలకు 150 బస్తాలు రావడం గమనార్హం. మరోపక్క రాజకీయ ప్రలోభాలతో కూటమి నాయకులు సచివాలయ సిబ్బందితో కుమ్మక్కై రైతులకు కూపన్లను తీసుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కూపాన్లు తీసుకున్న రైతులకు మళ్లీ కొత్తగా అతంటికేషన్ వేలిముద్రలు వేయాలని, లేనిచో యూరియా ఇవ్వడం కుదరదని సిబ్బంది తెలుపుతున్నారు. దీంతో అతంటికేషన్ వేలిముద్ర కేంద్రం

కూపన్ల కోసం లైన్‌లో ఉన్న రైతులు

వద్ద అవస్థలు పడుతున్నారు. మరోపక్కన బస్తాలపై అదనంగా రూ.20 వసూలు చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. యూరియా అందడం లేదని ఫిర్యాదు చేయడానికి రైతులు వస్తే... వ్యవసాయ అధికారులు అందుబాటులో ఉండడం లేదు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి యూరియా పూర్తిస్థాయిలో సరఫరా చేయాలని కోరుతున్నారు.

ప్రజా సమస్యల కోసమే డిజిటల్ బుక్

ప్రజాశక్తి- లావేరు

ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు, కూటమి ప్రభుత్వంలో అన్యాయానికి గురవుతున్న వైసిపి కార్యకర్తల కోసమే డిజిటిల్ బుక్‌ను వైసిపి అధ్యక్షులు, మాజీ సిఎం జగన్మోహన్ రెడ్డి రూపొందించారని వైసిపి మండల అధ్యక్షుడు దన్నాన రాజనాయుడు అన్నారు. సోమవారం లావేరులో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్యకర్తలకు వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డి అండగా వుంటారన్నారు. ఏ సమస్య ఉన్నా పార్టీ దృష్టికి తీసుకురావాలన్నారు. మండల ప్రత్యేక ఆహ్వానితులు రొక్కం బాలకృష్ణ, జెడ్‌పిటిసి మీసాల సీతంనాయుడు, గొర్లె అప్పలనాయుడు, ఎంపిటిసిల సంఘం మండల అధ్యక్షుడు జగ్గురోతు తవిటినాయుడు, కొత్తకోట సర్పంచ్ శాంతాటి భాస్కరరావు, ఎంపిటిసి యినపకుర్తి సతీష్, పాల్గొన్నారు.

కొత్తూరు : పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైసిపి నాయకులు

బూర్జ: మండలంలోని మదనాపురంలో వైసిపి మండల అధ్యక్షులు కె.గోవిందరావు ఆధ్వర్యంలో డిజిటల్ బుక్, క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి కె.నాగేశ్వరరావు, వైస్ ఎంపిపి కరణం కృష్ణమూర్తి నాయుడు, పెద్దపేట ఎంపిటిసి కె.నవీన, పాలవలస సర్పంచ్ జల్లు బలరాం, అల్లెన సర్పంచ్ జడ్డు మహేశ్వరరావు, కొల్లివలస సర్పంచ్ జీడి వేణు, చీడివలస సర్పంచ్ బూరి శ్రీరామ్మూర్తి, వైసిపి పత్రికాసెల్ కార్యదర్శి బి.సత్యం, నీలంపేట ఎంపిటిసి మజ్జి నరసింగరావు తదితరులున్నారు.

కొత్తూరు: స్థానిక వైఎస్ఆర్ విగ్రహం వద్ద వైసిపి మండల కన్వీనర్ గండివలస ఆనందరావు, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు చింతాడ సూర్యనారాయణ ఆధ్వర్యాన సోమవారం డిజిటల్ బుక్‌ను ఆవిష్కరించారు. అంతకుముందు స్థానిక వ్యవసాయ కార్యాలయానికి చేరుకొని యూరియా కొరత, ఇకెవైసి తదితర సమస్యలపై ఎఒ స్వర్ణలతకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి కామక భాగ్యవతి, ఎంపిపి సవర సావిత్రమ్మ, నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షులు అగతముడి నాగేశ్వరరావు, ఎంపిటిసి వనము లక్ష్మీ నారాయణ, జిల్లా ఎస్‌సి సెల్ కార్యదర్శి గుడబండి పోలయ్య, సర్పంచ్ ప్రతినిధి అగతముడి రంజిత్, రాజుల నాయుడు, సవర రమేష్, దూళి అప్పన్న, మఠం పూర్ణ పాల్గొన్నారు.

నిందితులను అరెస్టు చేసిన పోలీసులు

గంజాయితో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి- పలాస

పలాస రైల్వేస్టేషన్ మార్గంలో 25 కిలోల గంజాయితో ఇద్దరిని అరెస్టు చేశామని సిఐ పి.సూర్య నారాయణ తెలిపారు. ఈ మేరకు పోలీస్‌స్టేషన్‌లో నిందితులను సోమవారం విలేకరుల ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ ఒడిశా రాష్ట్రంలో కొనుగోలు చేసిన పది కిలో గంజాయిని పలాస రైల్వే స్టేషన్ మీదుగా కోల్‌కత్తాకు పర్లాకిమిడికి చెందిన తరలిస్తున్నాడని అనానరు. ఆయనను అరెస్టు చేసి గంజాయిని, సెల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నా మన్నారు. గజపతి జిల్లా జలంతర్సింగ్‌కు చెందిన రాజేష్ బిర ఒడిశా రాష్ట్రంలో కొనుగోలు చేసిన 15 కిలోల గంజాయిని తెలంగాణాకు రైలు ద్వారా అక్రమ రవాణా చేసేందుకు స్టేషన్‌కు వెళ్తున్నారని అన్నారు. ఆయన వద్ద కూడా గంజాయిని, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్టు చేశామని అన్నారు.

దగ్ధమవుతున్న ఎలక్ట్రిల్ షాపు

ఎలక్ట్రికల్ షాపు దగ్ధం

కొత్తూరు: స్థానిక నాలుగు కోడ్ల కూడలి బత్తిలి రహదారిలో ఉన్న ఎలక్ట్రికల్ అండ్ హాడ్‌వేర్ షాప్ షార్ట్‌సర్క్యూట్ కారనంగా ఆదివారం వేకువజామున దగ్ధమైంది. పక్కనే ఉన్న మెడికల్ షాపు యజమాని చంద్రశేఖర్ నిద్రించారు. గోడ వేడి నుంచి వేడి గాలి రావడంతో వెంటనే మేల్కొని లేచి చూశారు. వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందజేశారు. సిబ్బంది శకటంతో సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసే చర్యలు చేపట్టారు. సగంలో నిరు లేకపోవడంతో మళ్లీ కేంద్రానికి వెళ్లారు. నీరు నిల్వ చేసుకుని వస్తుండగా... వాహనం మధ్యలో మరమ్మతుకు గురైంది. ఇంతలో మంటలు ఎగిసి పడ్డాయి. వెంటనే ఆమదాలవలస, పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ అగ్నిమాప కేంద్రానికి సమా చారం అందజేశారు. అనంతరం మూడు అగ్నిమాపక వాహనాలతో సుమారు ఆరు గంటలు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా షాపు యజమాని రణస్థలం తన బంధువుల ఇంట్లో భజన కార్యక్రమానికి వెళ్లారు. అక్కడి నుంచి వచ్చేసరికి ఆలస్యంగా రావడంతో ముందు షర్టర్ తెరిచేందుకు అగ్నిమాపక అధికారులు ఇబ్బంది పడ్డారు. ఈ ప్రమాదంలో ఎలక్ట్రికల్ సామగ్రి కాలిపోవడంతో సుమారు రూ.70 లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లిందని యజమాని తెలిపారు. జిల్లా అగ్నిమాపక అధికారి జె.మోహన రావు, కొత్తూరు అగ్నిమాపక అధికారి శంకరరావు ప్రమాదానికి గల కారణాలు తెలుసుకుని ఆస్తినష్టం అంచనా వేశారు.

విశ్వప్రసాద్‌ను పరామర్శిస్తున్న నాయకులు

పీరుకట్లకు పరామర్శ

బూర్జ: మండలం రాజుపేటలో మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్ తల్లి మరణించిన తెలుసుకొని సోమవారం ఆ కుటుంబాన్ని పలువురు నాయకులు పరామ ర్శించారు. ఎపి మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణ నాయుడు, రాష్ట్ర బిసి కార్పొరేషన్ డైరెక్టర్ పిసిని చంద్రమోహన్, రాష్ట్ర నాయకులు పేడాడ రామ్మోహన్, మండల జనసేన అధ్యక్షులు కొత్తకోట నాగేంద్ర, జనసేన రాష్ట్ర నాయకులు కొల్ల జయరాం, కూటమి నాయకులు, కార్యకర్తలు పరామర్శించారు.


అన్నదానంలో పాల్గొన్న ప్రజలు

రాపాకలో అన్నదానం

పొందూరు: మండలంలోని రాపాకలో దుర్గాదేవి నవరాత్రుల మహోత్సవాల్లో భాగంగా సోమవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిసర గ్రామాలకు చెందిన వేలాది మంది ప్రజలు ఈ అన్నదానానికి హాజరయ్యారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వందేళ్ల మర్రిచెట్టు సందర్శన

వజ్రపుకొత్తూరు: మండలంలోని నగరంపల్లి జిల్లా పరిషద్ ఉన్నత పాఠశాలలోని జాతీయ హరితదళ క్లబ్ (ఎన్‌జిసి క్లబ్) ఆధ్వర్యాన విద్యార్థులు ఉద్దానం రామకృష్ణాపురంలో గల వందేళ్ల చరిత్ర కలిగిన అతి పెద్ద మర్రిచెట్టు (వట వృక్షం)ను సోమవారం సందర్శించారు. ఎన్‌జిసి క్లబ్ క్లస్టర్ కో-ఆర్డినేటర్, పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులు కొయ్యల శ్రీనివాస రావు మార్గదర్శనంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. సుమారు ఎకరా విస్తీర్ణంలో ఒక పెద్ద మర్రి చెట్టు విస్తరించింది. వందేళ్లకు పైగా ఘనమైన చరిత్ర ఉందని పెద్దలు చెబుతున్నారు. ఈ మర్రి చెట్టు నుంచి వచ్చే ఊడలు పెరిగి నేలలోకి పాతుకుపోవడం వల్ల ఎకరా విస్తీర్ణంలో ఈ చెట్టు విస్తరించిందని గ్రామస్తులు తెలిపారు. దీని అసలు మొదులు ఏదో ఎవరికీ తెలియ దని, ఇదో గొప్ప విషయమని, ఉద్దాన ప్రాంతానికే మణి హారమని శ్రీనివాసరావు విద్యార్థులకు వివరించారు. ఇలాంటి అరుదైన చెట్లను కాపాడు కోవడం ద్వారా జీవవైవిద్యాన్ని సంరక్షించవచ్చని తెలిపారు.

మర్రి చెట్టును పరిశీలిస్తున్న విద్యార్థులు

రైతులు ఆందోళన చెందవద్దు

ప్రజాశక్తి- పలాస

ఎరువుల కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఎరువులు ఎప్పటికప్పుడు దిగుమతి అవుతున్నాయని తహశీల్దార్ టి.కళ్యాణ చక్రవర్తి అన్నారు. గ్రోమోర్ దుకాణం వద్ద ఎరువులు పంపిణీకి పెద్ద ఎత్తున సోమవారం రైతులు చేరుకున్నారు. విషయం తెలుసుకున్న తహశీల్దార్ అక్కడకు చేరుకొని పంపిణీ విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి రైతుకూ ఎరువులు అందిస్తామని అన్నారు. అయితే ప్రతి రైతూ వేలిముద్ర వేయాలి ఉండడంతో పంపిణీలో జాప్యం ఏర్పడుతుందన్నారు. దీనిపై రైతులు సమన్వయం పాటించాలని కోరారు. వరుస క్రమంగా వచ్చి పంపిణీలో జాప్యాన్ని గుర్తించి వేచి ఉండాలని రైతులకు సూచించారు. ఎరువులు పంపిణీ కూడా వేతవంతం చేయాలని దుకానం యజమానికి సూచించారు.

మాట్లాడుతున్న తహశీల్దార్ కళ్యాణ చక్రవర్తి

నోటీసులు అందజేస్తున్న రెవెన్యూ అధికారులు

రైతులకు భూ సర్వే నోటీసులు

ఇచ్ఛాపురం : మండలంలో బాలకృష్ణాపురం పంచాయతీ రైతులకు రెవెన్యూ అధికారులు భూ సర్వే నోటీసులు జారీ చేశారు. ఎపి సర్వే, సరిహద్దుల చట్టం ప్రకారం నోటీసులు అందజేశారు. ఈ నోటీసులు అందుకున్న రైతులు తమ పంట పొలాలు విస్తీర్ణం భూమి వివరాలు ఉంటాయన్నారు. అందులో తప్పులు ఉంటే కార్యాలయానికి దరఖాస్తులు చేసుకుంటే సరిచేయడానికి వీలు ఉంటుందని రెవెన్యూ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి బోరుభద్ర లోహిదాసు, సర్వేయర్ పిట్ట సాయికుమార్, విఆర్ఒ ఢిల్లీరావు, విఆర్ఎ కృష్ణ పాల్గొన్నారు.

పతకాలతో విద్యార్థులు

కొల్లిపాడు బాలికలకు 12 పతకాలు

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

జిల్లాస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో మండలంలోని కొల్లిపాడు హైస్కూల్ బాలికలు 12 పతకాలు సాధించి కీర్తి తెచ్చుకున్నారు. పొందూరులో జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యాన యంగ్ స్టార్ యూత్ క్లబ్ నిర్వహించిన ఈ పోటీల్లో సబ్ జూనియర్, జూనియర్ విభాగాల్లో 4 బంగారు, 6 వెండి, 2 కాంస్య పతకాలు సాధించారు. పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయుడు పిలక ధనుంజయ కుమార్ శిక్షణ ఇచ్చారు. హెచ్ఎం మెట్ట రామారావు, ఉపాధ్యాయులు అభినందించారు.

నేత్ర వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలోని గురండి పంచాయతీలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ, రాగోలు జెమ్స్ సంయుక్తంగా సోమవారం నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఆప్తాలమిక్ వైద్యాధికారులు ఐ.జానకిరామయ్య, ఈశ్వరరావులు 53 మందికి నేత్రాలను పరీక్షించారు. అందులో 21 మందికి నేత్ర పరీక్షలకు ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. వీరిని వచ్చే 6న జెమ్స్‌లో ఆపరేషన్ చేయనున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బోర సింహాద్రినాయుడు, పిఆర్ఒ రాము, జి.పార్వతులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురంలోని డిగ్రీ కళాశాలలో 2013-16 బ్యాచ్ కళాశాల విద్యార్థులు పదేళ్ల తరువాత సోమవారం కలుసుకున్నారు. సుమారు 40 మంది పూర్వ విద్యార్థులు కలుసుకుని ఆ రోజులను గుర్తు చేసుకున్నారు. వేర్వేరు ప్రదేశాల్లో స్థిరపడిన వారందరూ ఒకేచోట కలిసి రావడం చూడటం ఆనందంగా ఉంది. కార్యక్రమంలో పండిట్ శివ ప్రసాద్, అసి ప్రశాంత్, కల్లా శివ, బి.లోహిత్, రోహిత్, ధరంరాజు, నిర్మల, కల్పన పాల్గొన్నారు. ముందుగా అప్పటి గురువులకు దుశ్శాలువ కప్పి సన్మానించారు.

గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

శ్రీముఖలింగేశ్వరునికి యాత్రికుల తాకిడి

క్యూలో ఉన్న యాత్రికులు

ప్రజాశక్తి- జలుమూరు

మండలంలోని శ్రీముఖలింగంలో ఉన్న శ్రీముఖలింగేశ్వర ఆలయానికి యాత్రికులు తాకిడి సోమవారం పెరిగింది. ఆశ్వజ మాసంలో కావడంతో జిల్లా నుంచే కాక ఒడిశా రాష్ట్రం నుంచి యాత్రికులు తరలివచ్చారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు కార్య నిర్వహణాధికారి వాసుదేవరావు తెలిపారు.

పరామర్శ

పొందూరు: మండలంలోని కృష్ణాపురం గ్రామంలో కిడ్నీ వ్యాధితో మృతి చెందిన గార వెంకటమ్మ, చిత్తిరి సూర్యనారాయణ కుటుంబ సభ్యులను సోమవారం జనసేన జిల్లా అధ్యక్షులు పిసిని చంద్రమోహన్ పరామర్శించారు. గ్రామంలో అనేక మంది కిడ్నీ వ్యాధి బారిన పడుతున్నారని, కిడ్నీ వ్యాధిని గుర్తించేందుకు వైద్యాధికారులు శిబిరాలను నిర్వహించి అనేక పరీక్షలు జరుపుతున్నారన్నారు. గ్రామంలో కిడ్నీ వ్యాధికి గల కారణాలపై లోతుగా అధ్యయనం చేసేలా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను కోరనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈయనతో జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి కొంచాడ చిన్నంనాయుడు, కార్యనిర్వాహణ కమిటీసభ్యులు గార బాబూరావు, రాంబాబు మాస్టార్ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న చంద్రమోహన్

నందిగాంలో రైతు పండగ

నందిగాం : నందిగాంలో అష్టమి సందర్భంగా సోమవారం రైతు పండగ నిర్వహించారు. సాయంత్రం సంధ్యా వేళలో ఉడికి కర్రలను పట్టుకొని ఆలయం వద్ద నుంచి పొలాలకు తీసుకెళ్లారు. ఏటా దసరా ముందు వచ్చే అష్టమి రోజున ఇలా నిర్వహిస్తుంటామని రైతులు తెలిపారు.

చైర్మన్ పరామర్శ

పలాస : కాశీబుగ్గ విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రుంకు భీమారావు ఇటీవల గుండె పోటుకు గురై ఆపరేషన్ చేయించారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు సోమవారం ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయనతో పాటు వల్లభ, వైకుంఠరావు, డి.నాగు, పాలవలస లక్ష్మణరావు ఉన్నారు.

గ్రంథాలయాధికారికి పుస్తకాలు అందజేస్తున్న దీపక్

పోటీ పరీక్షల పుస్తకాలు వితరణ

ప్రజాశక్తి- లావేరు

స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారం పోటీ పరీక్షల పుస్తకాలు వితరణ చేశారు. శాఖా గ్రంథాలయంలో కాంపిటేషన్ పుస్తకాలు చదువుకుని ఉన్నత ఉద్యోగం సంపాదించిన కొమ్మాన దీపక్ రూ.2 వేలు విలువ గల పోటీ పరీక్షల పుస్తకాలను గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావుకు అందజేశారు. ఈ సందర్భంగా దీపక్ మాట్లాడుతూ తాను గ్రంథాలయంలోనే కాంపిటేషన్ పుస్తకాలు చదువుకొని ఉద్యోగం సంపాదించానని తెలిపారు. ప్రతి విద్యార్థి సెల్‌ఫోన్లకు దూరంగా ఉంటూ గ్రంథాలయానికి వస్తూ పుస్తకాలు చదువు కోవాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు టి.వీరభద్రుడు, పాఠకులు పాల్గొన్నారు.

శిలాఫలకం ఆవిష్కరిస్తున్న వెంకటేష్, జానకిరామయ్య

కలిసి ఉంటే కలదు సుఖం

ప్రజాశక్తి- కవిటి

ఒంటరి ప్రయాణం కంటే సామూహిక ప్రయాణంలో ఎటువంటి కార్యమైనా విజయవంతంగా పూర్తి చేయగలమని, కలిసి ఉంటే కలదు సుఖమని సోంపేట ప్రభుత్వాస్పత్రి వైద్యులు తుంగాన వెంకటేష్, విశ్రాంత ఎంఇఒ గొండ్యాల జానకిరామయ్య అన్నారు. మండలంలోని గొండ్యాలపుట్టుగలో రూ.12 లక్షల వ్యయంతో గ్రామస్తులంతా ఏకమై రేకు షెడ్డు నిర్మించారు. గ్రామానికి చెందిన బంగారమ్మ చేతుల మీదుగా సోమవారం ఈ షెడ్‌ను ప్రారంభించి శిలాఫలకం ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ భవిష్యత్‌లో ఎన్నో మంచి కార్యక్రమాలకు ఈ షెడ్ వేదికవుతుందని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.